క్లుప్తంగా

వినతులను సత్వరమే పరిష్కరించాలి..



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ : రీ సర్వేలో భాగంగా రైతులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు డీటీ సన్యాసిరావు ఉన్నారు.

అభినందనలు..



జిల్లా ప్రధాన కార్యదర్శి మీగడ సంతోష్‌ను అభినందిస్తున్న జిల్లా నాయకులు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా అర్చక సంఘ నూతన ప్రధాన కార్యదర్శిగా భామిని ఆలయ అర్చకుడు మీగడ సంతోష్ ఎన్నికయ్యారు. గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యరల రాంబాబు, జిల్లా అధ్యక్షుడిగా లింగరాజు, ఉపాధ్యక్షుడిగా వెంకట వేణుగోపాల్ శర్మ, సహాయ కార్యదర్శిగా ఆరిక రామారావు, కోశాధికారిగా మహేష్ పండా ఎన్నికయ్యారు. ఈ మేరకు కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

కోటదుర్గమ్మను దర్శించుకున్న కమిషనర్



అమ్మవారిని దర్శించుకుంటున్న కమిషనర్ సత్యనారాయణ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మను దేవదాయ శాఖ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీరామ్ సత్యనారాయణ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి అమ్మవారి ఆశీర్వచనాలు అందించారు. ఆయనతో పాటు ఏసీ సీపాన రాజారావు, సీనియర్ అసిస్టెంట్ రాజు, ఆలయర్వో వీవీ సూర్యనారాయణ ఉన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ: భామిని మండలంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ... భామిని మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో పత్తి సాగు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. దళారీలు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని.. అధికారులు స్పందించి భామిని మండల కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘ నాయకుడు కిమిడి రామూర్తి ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

• ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు, అధికారులు సమష్టిగా పనిచేయాలని ఎంపీడీఓ జి. పైడితల్లి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండో విడత శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని చెప్పారు. చినగుడబ పంచాయతీ కార్యదర్శి టి. భాస్కరరావు శిక్షణలో భాగంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్. గోపాలరావ పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కార్యదర్శి భాస్కరరావు



చింతాడ వద్ద వరి చేలను కుప్పగా వేస్తున్న రైతులు



ఎండుగడ్డిని ఇళ్లకు తరలిస్తున్న రైతులు



పాలకొండ - వీరఘట్టం రహదారిలో తరలించేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

అన్నదాతల ఇక్కట్లు..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గురువారం చల్లని గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఆపసోపాలు పడ్డారు. మండల వ్యాప్తంగా దాదాపు 12 వందల ఎకరాల్లో వరి కోతలు చేపట్టాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతన్నలు కుటుంబాలతో సహా పొలాలు, కళ్లాల్లోనే గడుపుతూ కోతలు, నేర్పులు చేపట్టి ధాన్యం, గడ్డిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే చల్లని గాలులకు వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల జాగ్రత్తగా ఉండాలని ఏరియా ఆస్పత్రి వైద్యుడు జె.రవీంద్రకుమార్ సూచించారు. వరుస వర్షాలతో వైరస్‌ల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

– పాలకొండ రూరల్



పట్టణ పరిసరాల్లో కురుస్తున్న వర్షం

నిఘా పెంచాలి..

• డీఎస్పీ రాంబాబు

పాలకొండ రూరల్: వరుస పండగలు, న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు మరింత నిఘా పెంచాలని డీఎస్పీ ఎం. రాంబాబు అన్నారు. గురువారం తన కార్యాలయంలో మాసాంతపు క్రైమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, వాటి తాజా పురోగతిపై ఆరా తీశారు. ప్రస్తుత నెల నుంచి పండగలు కొనసాగనున్న నేపథ్యంలో నిఘా విభాగాన్ని క్షేత్ర స్థాయిలో మరింత పటిష్టం చేయాలని సూచించారు. పండగలకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాపార సముదాయాలు, ప్రధాన మార్కెట్లు, జ్యుయలరీ వర్తకులతో చర్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాత నేరస్తుల కదలికలు, నిషేధిత మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై డేగ కన్ను వేయాలన్నారు. రోడ్డు ప్రమాదల నివారణలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం సూచనలు కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వాహన చోదకులు సీట్ బెల్ట్, హెల్మెట్లు వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల పురోగతిపై రివ్యూ చేపడుతున్న డీఎస్పీ రాంబాబు

నేటి నుంచి సోషల్ ఆడిట్

భామిని: మండలంలో 01-04-23 నుంచి 31-03-34 వరకు చేపట్టిన ఉపాధి పనులపై శుక్రవారం నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుండేల చంద్రరావు, ఏపీఓ ఈ.తులసీదాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎస్‌ఆర్‌పీ దాస్ ఆధ్వర్యంలో రికార్డుల అప్పగింతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలో రూ.18.91 కోట్లతో ఉపాధి పనులు చేపట్టినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న అధికారులు

రికార్డుల మేరకు భూముల అప్పగింత

భామిని: రెవెన్యూ రికార్డుల మేరకు భూముల అప్పగింత చేపడుతున్నట్లు తహసీల్దార్ నీలాపు అప్పారావు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దళిత నేత లోపింటి రాజేష్, గిరిజన నాయకుడు బిడ్డిక విష్ణు, మండల సర్వేయర్ రాజేశ్వరరావు, వీఆర్‌ఓ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

పాలకొండ రూరల్: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి తప్పుడు వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాల జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొండ - యాలం కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గురించి చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ సభ్యులు బత్తిన మోహనరావు, శిర్లి జయరాం, జి.రవికుమార్, పి.రమేష్, ఎం.లక్ష్మణరావు, ఎన్. సూరిబాబు, శంకర్, కరుణాకర్, అఖిల్, రాజాన చంటి, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత సంఘాల జేఏసీ సభ్యులు

రైతులకు అందని టార్పాలిన్లు..



రాజ్యలక్ష్మీపురంలో నూర్పులు చేస్తున్న రైతులు

కొమరాడ: వరి నూర్పులు పూర్తయినా ఇంతవరకు రైతులకు టార్పాలిన్లు అందలేదు. దీంతో మండల రైతాంగం టార్పాలిన్ల కోసం ఎదురుచూస్తోంది. మండలంలో ఇప్పటికే 90శాతం వరి కోతలు పూర్తయ్యాయి. నూర్పులు కూడా చేపట్టి మిల్లులకు తరలిస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండడంతో ధాన్యం బస్తాలను తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు స్పందించి తమకు టార్పాలిన్లు అందజేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

సీతంపేట: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని బ్రదర్ అంజూరి ఫిలిప్ తిమోతి అన్నారు. మండలంలోని అక్కన్నగూడలో ఫెల్లోషిప్ ఆఫ్ ట్రైబుల్ బ్రదర్స్ అస్లెంబ్లీస్ ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్ సింహాచలం, ఎస్.భాస్కరరావు, ఎస్.షోడంగ, ఎస్.చిరంజీవులు, ఎస్.ఆనందరావు, సుంకయ్య, ఎస్.సూర్యారావు, ఎం.విశ్వనాథం, శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో దాతల సహకారంతో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గరుగుబిల్లి, పెద్దూరు, హిక్కింవలస, రావుపల్లి, బీవీ పురం, తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



విశాఖ రోడ్డులో వాహన తనిఖీలు చేపడుతున్న ఎస్సై, సిబ్బంది

పాలకొండ రూరల్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ - విశాఖ, వీరఘట్టం, సీతంపేట రహదారుల్లో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని పలువురికి అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న మైదానంలో శుక్రవారం నుంచి ఈ నెల 24 వరకు మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్సై పి. నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

భారీ వర్షాలు కురిసే అవకాశం..

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది అని వాతావరణ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూర్పులు పూర్తి చేసిన రైతులు ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పి భద్రపరుస్తున్నారు. కొంతమంది ధాన్యం బస్తాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే క్రమంలో బిజీగా ఉన్నారు.

ప్రేక్షకులను దోచుకుంటున్నారు

వీరఘట్టం: ఈనెల 5న రిలీజైన పుష్ప-2 సినిమాకు ఈనెల 17 వరకు టికెట్ల రేట్లు పెంచుకోవచ్చని ప్రభుత్వం అనుమతిస్తే.. స్థానిక బీఎంఆర్ థియేటర్ యాజమాన్యం ఇప్పటికీ టికెట్ రేట్లు పెంచి విక్రయిస్తుండడంపై అల్లు అర్జున్ అభిమానులు మండిపడుతున్నారు. ఈ మేరకు థియేటర్ యాజమాన్యం టికెట్ రేట్లు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీటీ నాగేంద్రప్రసాద్‌కు గురువారం ఫిర్యాదు చేశారు.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు

సీతానగరం: సువర్ణముఖి నదిఒడ్డున వెలిసిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామివారికి ముడుపుల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. లక్ష్మీనృసింహ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువ జాము నుంచి క్యూలో నిలబడి స్వామివారికి అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

వీరఘట్టం: వినియోగదారులు తమకున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల సంఘ జిల్లా అధ్యక్షురాలు పి.నాగమణి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... కొనుగోలు చేసే నిత్యావసర సరుకుల్లో కల్తీ ఉన్నా.. ధరల్లో వ్యత్యాసం ఉన్నా.. తూకంలో తేడా ఉన్నా వెంటనే వినియోగదారుల ఫోరంనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కల్తీని అరికట్టేందుకు వినియోగదారుల ఫోరం ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ వినోద్, ఏపీఎం కెల్ల రాము, ఏపీఓ జి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినియోదారుల సంఘ జిల్లా అధ్యక్షురాలు నాగమణి

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు..

పాలకొండ రూరల్: సొంతిల్లు లేని వారు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ అధికారి జి.రవి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. భామిని, పాలకొండ, వీరఘట్టం, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో ఇళ్లు లేని వారు నేరుగా దరఖాస్తులు అందించాలన్నారు. ఇందుకోసం అర్హులు తెలుపు రేషన్‌కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, పొజిషన్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం జిరాక్స్‌లతో సచివాలయంలో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ అధికారి రవి

మెనూ ప్రకారం భోజనం

• ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నాబాబు అన్నారు. మండలంలోని ఓంద్రుజోల ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రక్షిత వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించి, నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించి, బాగా చదువుకోవాలని సూచించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం గౌరీపేట, బంజారుగూడ గ్రామాల్లో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.



ఆశ్రమ పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

వారపు సంతలో క్రిస్మస్ సందడి..



భామిని మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సంతలో క్రిస్మస్ సందడి నెలకొంది. ఆదివాసీ గిరిజన ప్రాంతంలో ఎక్కువ మంది క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో వారపు సంతలో ఎక్కువ మంది కొత్త దుస్తులు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు. -భామిని

ప్రారంభోత్సవం..



కురుపాం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్‌ఎంఎస్‌ఏ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు భవనాలను సద్వినియోగం చేసుకోవాలలన్నారు. బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులతో పాటు ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

– గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

సాధన యాత్రకు సీపీఐ మద్దతు

గుమ్మలక్ష్మీపురం: జంఝావతి ప్రాజెక్ట్ పూర్తవడానికి ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ చేస్తున్న సాధన యాత్రకు సీపీఐ తరపున పూర్తి మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుగుబిల్లి సూరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి కావడం ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో 38 మందితో జంఝావతి ప్రాజెక్ట్ సాధన కమిటీ వేసినట్లు తెలిపారు. జంఝావతి ప్రాజెక్ట్ ప్రారంభించి ఐదు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఈ క్రమంలో డిసెంబర్ 23 నుంచి 27 వరకు ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో గల ఐదు మండలాల్లో పర్యటించి, రైతుల సూచనలు తెలుసుకోవడం శుభ పరిణామమన్నారు.